ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 8 జనవరి 2025 | 5





జోష్..

సందడిగా యానాం ప్రజా ఉత్సవం

ప్రతి ఏటా పండుగగా జరిగే యానాం ప్రజా ఉత్సవం ఈసారీ సందడిగా జరుగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ వేడుకలు బుధవారం రాత్రితో ముగుస్తాయి.



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

మార్పు మీతోనే సాధ్యం!

- ఉన్నతమైన సమాజం నిర్మాణం వారి ద్వారానే..
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో పేర్కొన్న కాకినాడ జిల్లా కలెక్టర్

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలలో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కూడా పాల్గొన్నారు. - వివరాలు 6లో



తెలుగు పండుగకు ముస్తాబు


నేడు, రేపు జీజీయూలో ప్రపంచ తెలుగు మహా సభలు

జీజీయూ కులపతి చైతన్యరాజు సారథ్యంలో ఏర్పాట్లు పూర్తి

- మెయిన్‌లో



అలరించేలా!



పర్యాటకాభివృద్ధిపై యాక్షన్ ప్లాన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకేం తక్కువ.. అందమైన బీచ్‌లు లేవా.. ఆహ్లాదం పంచే ప్రకృతి ప్రదేశాలు లేవా.. ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలు లేవా.. అన్నీ ఉన్నాయి.. అయినా ఏదో వెలితి.. పర్యాటకాభివృద్ధిలో ఎప్పుడూ వెనుకబాటే.. కేరళను మించి అందాలున్నా.. గోవాను మించి బీచ్‌లున్నా ఎందుకో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 బీచ్‌లను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రచించింది.. అంతేకాదు.. ప్రసిద్ధ ఆలయాలకు కొత్త రూపు తీసుకురానున్నారు.. సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.. ఫిబ్రవరి నాటికి పర్యాటకంపై నివేదిక ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మూడు జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేస్తున్నారు.

- పర్యాటకానికి స్వర్ణాంధ్ర-2047
- ఐదేళ్లలో ప్రణాళికలపై కసరత్తు
- 18 బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు
- దానవాయిపేట బీచ్‌కు రూ.10 కోట్లు
- హోప్ ఐలాండ్‌కు రూ.8 కోట్లు
- అన్నవరం కొండపై రోప్‌వే
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు రూ.5 కోట్లు
- తలుపులమ్మ లోవకు రూ.6 కోట్లు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక రంగాన్ని ఇక పరుగులు తీయించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుదీర్ఘసాగర తీరం దగ్గర నుంచి ప్రఖ్యాత ఆలయాల వరకు పర్యాటకుల కోసం భారీ ప్రాజెక్టులకు పట్టాలెక్కించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో పూర్తిగా కుంటుపడిన పర్యాటక రంగాన్ని గాడినపెట్టేలా అనేక ప్రతిపాదనలతో విజన్‌ప్లాన్ తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కార్యాచరణ కసరత్తును ప్రభుత్వానికి పంపించారు. అందులో భాగంగా జిల్లాలో సుదీర్ఘ తీర రేఖ పొడవునా అనేక అందమైన బీచ్‌లున్న నేపథ్యంలో వాటిలో ముఖ్యమైన వాటిని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చేయనున్నారు.

మురిపించేలా...

కాకినాడ జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. తొండంగి నుంచి కాకినాడ వరకు సువిశాల సాగరతీరం పర్యాటకులను ఆకర్షిస్తోంది. సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ పర్యాటకులను కట్టిపడేస్తుంది. కోరంగి మడ అడవులు ఎంతో ప్రసిద్ధి. అన్నవరం నుంచి తలుపులమ్మ లోవ, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పురుహూతికా అమ్మవారి ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. జాతీయస్థాయి పర్యాటకులను ఆకర్షించే సత్తా ఉన్నప్పటికీ జిల్లాను గత వైసీపీ ప్రభుత్వం పర్యాటకంగా గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఐదేళ్ల విజన్ ప్లాన్ తయారు చేస్తోంది. ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్వర్ణాంధ్ర-2047 పేరుతో జిల్లాలో 2029లోగా పర్యాటక రంగం అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రూ.35 కోట్లతో పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనల ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18 బీచ్‌లను ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద అభివృద్ధి చేసే అవకాశం ఉందని నివేదికలో వివరించారు. తొలుత తొండంగి మండలంలోని దానవాయి పేటలోని బీచ్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు. వాస్తవానికి ఇక్కడ బీచ్ సువిశాలంగా ఉంటుంది. పర్యాటకులకు సురక్షితంగా ఉంటుంది. అలల తీవ్రత చాలా తక్కువ. పైగా ఇక్కడి నుంచి జాతీయ రహదారి సైతం చాలా దగ్గర. ఈ బీచ్‌ను రూ.10 కోట్లతో తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. అన్నవరం దేవస్థానానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి భక్తులు వేలల్లో వస్తుంటారు. రత్నగిరి కొండ నుంచి సత్యగిరి కొండకు 800 మీటర్ల పొడవునా రూ.6 కోట్లతో రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దగ్గర్లోనే దానివాయిపేట బీచ్ కూడా ఉండడంతో పర్యా టకపరంగా ఈ ప్రాంతానికి మరింత ఆదరణ లభిస్తుందని అంచనా వేశారు. కాకినాడ తీరం నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే వచ్చే హోప్ ఐలాండ్ పర్యాటక పరంగా పేరొందింది.గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌ను గాలికొదిలేసింది. బోటింగ్ నిలిపి వేసింది.దీంతో పర్యా టకులు ఈసురోమంటున్నారు. హోప్ ఐలాండ్‌కు తిరిగి నాటి వైభవం వచ్చేలా చేయడంతోపాటు ఎకో టూరిజం ప్రాజెక్టు కింద రూ.8 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అనేకమంది వస్తుంటారు. ఇక్కడ ఇప్పటికీ కనీస సదుపాయాలులేవు. చీకటైతే చిన్న లైట్ ఉండదు. ఈ బీచ్ వద్ద రూ.5 కోట్లతో సర్వ హంగులు తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. బీచ్ ఫ్రంట్ వద్ద కన్వెన్షన్ హాల్ నిర్మించనున్నారు. తలుపులమ్మ లోవ ఆలయం వద్ద రూ.6 కోట్లతో వివిధ వసతులను తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. కాకినాడ జిల్లాలో మొత్తం ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద 18 బీచ్‌లను తీర్చిదిద్దాల్సి ఉందని ప్రభుత్వానికి పంపిన నివే దికలో వివరించారు. అటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమలలో హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తున్నాయని.. వీటికి అనువైన భూములు గుర్తించి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

టార్గెట్ ఫిబ్రవరి

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఫిబ్రవరి నాటికి నివేదికలు పంపాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రధానంగా కాకినాడ కోరంగి వద్ద ఫోర్ సీజన్ హోటల్ పెట్టుబడులకు ముందుకు వచ్చింది. దీనికి 40 ఎకరాలను ఎంపిక చేసి ప్రతిపాదలను పంపాలని సూచించింది. రాజమహేంద్రవరంలో ఐఆర్‌సీటీసీకి 3 ఎకరాలను అన్వేషించి వివరాలు పంపాలని కోరింది. కోనసీమలోని పిచ్చుకలంక వద్ద మహీంద్రా హాలిడేస్ క్లబ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇందుకు 26 ఎకరాల వరకు అవసరమని అంచనా వేశారు. దీనికి సంబంధించి నివేదికలను ఫిబ్రవరిలో పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. స్వదేశీ దర్శన్ స్కీం కింద కోనసీమ, పాపికొండలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటికి భారీగా నిధులు రానున్నాయి. ఏడు పర్యాటక యాంకర్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో రాజమహేంద్రవరంలో పర్యాటకపరంగా ఇంకా ఏమేం చేయాలనే దానిపై సలహాలు, సూచనలు, ఆలోచనలు ఫిబ్రవరిలోగా పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

10న డిప్యూటీ సీఎం పవన్ రాక

6



రెడ్‌క్రాస్ తలసేమియా సేవా కేంద్రంలో యువకునికి బహుమతులు అందిస్తున్న షాన్‌మోహన్

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం : కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రంలోనేకాక దేశంలోనే కీర్తిప్రతిష్టలు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షుడు షాన్‌మోహన్ సగిలి హర్షం వ్యక్తంచేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు సర్ జీన్ హెన్రీ డ్యునంట్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావుతో కలిసి రెడ్‌క్రాస్ జనహిత జనరిక్ మెడికల్స్, ఆసుపత్రి, రక్తదాన వాహనం, బ్లడ్‌బ్యాంకు, ఐబ్యాంకు, తలసేమియా వ్యాధిగ్రస్తుల సేవా కేంద్రాలను సందర్శించారు. తలసేమియా బాధితులైన పిల్లలకు పండ్ల బుట్టలను అందజేసి వారితోను, వారి తల్లిదండ్రులతోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో రక్తాన్ని ఎక్కించుకుంటూ ఎంబీబీఎస్ సీట్ పొందిన యువకునికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రం ద్వారా రక్తం ఎక్కించుకుంటున్న వారెవరైనా జనవరిలో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న వారికి రెడ్‌క్రాస్ తరపున లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని కలెక్టర్ ప్రకటించారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతాప్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శిశు, మహిళా సంక్షే మ, శిక్షణా కేంద్ర భవనాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, వైస్‌చైర్మన్ ఎన్.సుగుణ, కోశాధికారి ఎన్‌వివిఆర్‌కె ప్రసాద్‌బాబు, ఇంజనీర్ ఎస్‌వీఎస్ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీని కోరిన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ

కాకినాడ క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా తీసుకునే ముందస్తు చర్యల గురించి చర్చించేందుకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. ముఖ్యంగా విస్తరణ పనులు చేపడుతున్న సామర్లకోట కాకినాడ ఏడీబీ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి సమయాల్లో లైటింగ్ లేని ప్రదేశాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేయాలని ఎంపీ కోరారు.

పోక్సో కేసులో నిందితుడికి 30 ఏళ్ల జైలు

- మెయిన్‌లో



ఇంద్రపాలెం వంతెన సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న పళ్లంరాజు, నేతలు

మోదీ పాలనలో రాజ్యాంగానికి ముప్పువాటిల్లే పరిస్థితులు

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా జరిగిన కార్యక్రమంలో పళ్లంరాజు

కాకినాడ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో రాజ్యాంగానికి ముప్పువాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి తొలగించాలని వారు నినాదాలు చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు నాయకత్వం వహించారు. పళ్లంరాజు మాట్లాడుతూ నేటి పాలకులు భారత రాజ్యాంగాన్ని అమలుపరచకుండా దానిలోని అన్ని వ్యవస్థలను క్షీణపరిచారన్నారు. స్వయం ప్రతిపత్తి గల సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌కు స్వేచ్ఛ లేకుండా అధికార పార్టీకి అనుకూలంగా మలచుకుని మహారాష్ట్రలో ఎన్నికల తేదీలు మార్చేశారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి రాంబాబు, నక్కా సత్యనారాయణ, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివప్రసాద్, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తుమ్మల దొరబాబు, మరోతి శివగణేష్, గేలం శ్రీనివాసరావు, నీరుకొండ సత్యనారాయణ, పిల్లి చిన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ కార్పొరేషన్ కాకినాడ డిప్యూటీ కలెక్టర్‌గా కుమార్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టీవీఎస్‌జీ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక్కడ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న మర్రిపూడి శ్రీనివాస్‌ను విజయవాడ బదిలీ చేశారు.



ఇక 'పాడా' పరుగులు!



- 19 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఒకే
- పీడీగా యువ ఐఏఎస్ అధికారి
- 30 శాఖలు పాడా పరిధిలోనే
- పిఠాపురం సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన, అమలు బాధ్యత
- తొలి దశలో రూ.50 కోట్లు కేటాయించాలని కలెక్టర్ నివేదిక

(ఆంధ్రజ్యోతి- పిఠాపురం)

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పాడా ఏర్పాటులో మరో ముందడుగు పడింది. పిఠాపురం నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపగా, నవంబరు 22న సాధారణ పరిపాలన శాఖ విధివిధానాలు ఖరారు చేస్తూ జీవో జారీ చేసింది. తాజాగా పాడాలో పీడీతో సహా 19 పోస్టులను మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజవర్గం కుప్పం తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పరిధిగా పాడా త్వరలోనే ఏర్పాటు కానున్నది. దీనికి పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా యువ ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ టైమ్‌స్కేల్‌లో ఉన్న ఐఏఎస్ అధికారి లేదా ఆర్డీవోగా పనిచేసిన సీనియర్ డిప్యూటీ కలెక్టర్‌లను పీడీగా నియమించాలని జీవోలో నిర్దేశించారు. ఐఏఎస్ అధికారి అయితేనే పాడా పరిధిలోకి తీసుకువచ్చిన సుమారు 30 శాఖలు, ప్రభుత్వ విభాగాలను పర్యవేక్షించడంతోపాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ రూపకల్పన, పేదరిక నిర్మూలనకు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం వీలవుతుందని పవన్ భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు పాడా పరిధిలోకి ప్లానింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, జలవనరులు(ఇరిగేషన్), గ్రామీణాభివృద్ధి (డీఆర్డీఏ, డ్వామా), అటవీశాఖ, ప్రాథమిక, ఉన్నత విద్య, వైద్య, ఆరోగ్యశాఖ, వ్యవసాయ, ఉద్యానవన, సెరీకల్చర్, పశుసంవర్ధకశాఖ, అన్ని సంక్షేమశాఖలు, మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ, పౌరసరఫరాలు, హౌసింగ్ తదితర శాఖలను తీసుకువచ్చారు. పాడా పరిధిలో వచ్చే అన్ని ప్రభుత్వశాఖల అధికారులపై ప్రాజెక్టు డైరెక్టర్‌కు పర్యవేక్షణ, సెలవులు మంజూరు, టీఏ, ఇతర బిల్లుల మంజూరు, వార్షిక రహస్య నివేదికలను ఎస్ఆర్‌లో నమోదు చేయడం, క్రమశిక్షణా చర్యలు, విచారణ తదితర అధికారాలను కట్టబెట్టారు. అదేవిధంగా పాడా పరిధిలో ఏ అధికారిని లేదా సిబ్బందిని బదిలీ చేసిన తర్వాత ఆ స్థానంలో మరొకరిని నియమించిన తర్వాతే రిలీవ్ చేయాల్సి ఉంటుంది. కలెక్టర్ చైర్మన్ ఉన్న పాడాకు యువ ఐఏఎస్‌ను నియమిస్తే అనుకున్న లక్ష్యాల సాధన సులువవుతుందని భావిస్తున్నారు. ఇక పాడా పరిధిలోకి పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు పిఠాపురం మండలంలోని 24 గ్రామాలు, గొల్లప్రోలు మండలంలోని 10 గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని 18 గ్రామాలు వెరసి 52 గ్రామాలు వస్తాయి. వీటిపై పూర్తి నియంత్రణ పాడాకే ఉంటుంది. పాడా కార్యరూపం దాల్చేందుకు ముందుగా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పిఠాపురం కేంద్రంగా పాడా ఏర్పాటు చేస్తున్నట్టు జీవోలో స్పష్టంగా పేర్కొన్న నేపథ్యంలో ఇందుకు అవసరమైన భవనం కోసం వెదుకులాట ప్రారంభమైంది. పాడా ప్రాజెక్టు డైరెక్టర్, చైర్మన్ చాంబర్‌లు, సమావేశాల నిర్వహణకు హాలు, పాడాకు వివిధ శాఖల నుంచి నియమితులయ్యే 19మంది అధికారులు, సిబ్బంది కూర్చొనే ఏర్పాటు ఉండాలి. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కొంతభాగాన్ని తీసుకుని పాడా కార్యాలయం ఏర్పాటుచేస్తే ఎలా ఉంటుందనే దానిపై కసరత్తు సాగుతోంది. మరోవైపు కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది జీతభత్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పన, పాడా పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు రూ.50 కోట్లను తొలి విడతగా కేటాయించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. రాష్ట్రస్థాయిలో ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ నిధులు ఆ శాఖ నుంచి మంజూరు కావాల్సి ఉంటుంది. నిధులు విడుదల కాగానే తొలుత తాత్కాలిక పాడా కార్యాలయం మొదలవుతుంది.

గుట్టు రట్టు!



కోమటికుంటలో శ్రీమాతంగమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

5 టన్నులు స్వాధీనం

భాగస్వాములపై కేసు నమోదు

గోపాలపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో కోమటికుంట రెవిన్యూ పరిధిలో శ్రీమాతంగమ్మతల్లి ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుట్టు రట్టయ్యింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కోమటిగుంట గ్రామానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి మధ్య భాగస్వామ్యంతో కొనసాగుతున్న మిల్లులో అధికారులు 2 రోజుల పాటు తనిఖీలు చేశారు. ఈ రైస్‌మిల్లులో మంగళవారం రెవెన్యూ అధికారులు సుమారు 5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం మండలంలోని కోమటికుంట రెవెన్యూ పరిధిలో కొన్నేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మేకా శేషుబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, మరో ముగ్గురితో కలిసి మాతంగమ్మ మెట్ట వద్ద శ్రీమాతంగమ్మ ఆగ్రో రైస్‌మిల్లును ఏర్పాటు చేశారు. ఈ రైస్‌మిల్లులో శేషుబాబు కుటుంబంలో నలుగురికి 80 శాతం వాటాలు, మిగిలిన 20శాతం శ్రీరామమూర్తి భాగస్వామ్యంతో ఫర్మ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది చాలాకాలం పాటు బాగానే నడిచింది. ఇటీవల భాగస్వాముల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ప్రారంభించారు. ఈ మిల్లు నిర్వహణపై ఎప్పటి నుంచో ఎన్నో ఆరోపణలు ఉండడంతో గతంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. అయితే అప్పటికి వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం వీరికి బాగా కలిసొచ్చింది. దీంతో అప్పుడు విషయం బయటకు పొక్కలేదు. ఇటీవల ఇద్దరి భాగస్వాముల మధ్య అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచినట్టు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం విష్ణుప్రియ మిల్లు పేరుతో మరొకలోడు ఉన్న విషయం బయటకు పొక్కింది. ఈ మేరకు సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్, పోలీస్, రెవెన్యూ అధికారులు మిల్లును చుట్టుముట్టి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ సంచుల్లో 2,133 కిలోల పీడీఎస్ బియ్యంతో పాటు మరో లారీలో రీసైక్లింగ్ చేసి గోనుసంచుల్లో ఉన్న 580 బస్తాలకు సంబంధించి 3.01 టన్నుల బియ్యం మొత్తంగా 5,233 కిలోలు సీజ్ చేసినట్టు తహశీల్దార్ కె.అజయ్‌బాబు, సీఎస్ డీటీ దివాకర్ తెలిపారు. రైస్‌మిల్లు యజమానులు మేకా శేషుబాబు, వెలగా శ్రీరామ్మూర్తిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం బియ్యాన్ని చిట్యాల శివారులో ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ రైస్‌మిల్లులో భద్రపరిచారు. యాజమాన్యంతో పాటు మరోకొంతమందిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు.. గిరిజనుడి బలి



మృతిచెందిన గిరిజనుడు శంభురెడ్డి

విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత

మరొకరికి తీవ్రగాయాలు

వై.రామవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువులను హతమార్చేందుకు వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి అనేక మంది గిరిజనులు ప్రాణాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. తాజాగా అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతంలో ఉన్న దారగడ్డ పంచాయతీలో అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతిచెందగా మరొక గిరిజనుడు తీవ్రంగా గాయపడి గుర్తేడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దారగడ్డ పంచాయతీలో బురదవలస గ్రామంలో తాటికొండ వీధికి చెందిన కడబాల శంభురెడ్డి (40) వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగల బారిన పడి మృతిచెందగా అతడి వెంట వెళ్లిన మరో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమ విద్యుత్ తీగలను ఉపయోగించే వ్యక్తులను నివారించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దారగడ్డ ఉపసర్పంచ్ సాసుం రాఘవరావు కోరారు.



గాయపడిన మరో గిరిజనుడు

నిబంధనలు అతిక్రమించలేదు

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్
- పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై స్పందన

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ స్పందించారు. ఆంధ్రజ్యోతికి ఆయన వివరణ ఇచ్చారు. ఫైరింగ్ శిక్షణ జరిగే సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, నిబంధనలు పాటించడం జరుగుతుందన్నారు. ఫైరింగ్ ప్రదేశంలో అక్కడున్న చిన్నారులు ఫైరింగ్ శిక్షణకు వచ్చిన అధికారి సంతానం మాట వాస్తవమే అని చిన్నారుల సంరక్షణకు ఎవరూలేక అక్కడకు తీసుకువచ్చినట్లు వివరణ ఇచ్చారు. ఫైరింగ్ విరామ సమయంలో చిన్నారులను అక్కడికి అనుమతించినట్టు తెలిపారు.

12 వరకు ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు స్వీకరణ

తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శోభారాణి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాలు స్వీకరణ గడువు ఈనెల 12 తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్.శోభారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలు ఈ నెల 16వ తేదీ వరకు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కోరారు.

మార్పు మీతోనే సాధ్యం

గురువులే మార్గదర్శులు

- నా తల్లిద్రండులు కూడా టీచర్లే
- అది నాకు దక్కిన అదృష్టం
- 3వ రోజు యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్





కాకినాడ జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, సభకు హాజరైన యూటీఎఫ్ ప్రతినిధుల బృందం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజంలో మార్పు తీసుకురాగలరనీ, ఉన్నతమైన సమాజ నిర్మాణం వారి ద్వారానే జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు ఎంతో గౌరవమన్నారు. తన తల్లిద్రండులు కూడా ఉపాధ్యాయులు కావడం తన అదృష్టమన్నారు. ఉపాధ్యాయులు విద్యను బోధించడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసేవారిలో ఉపాధ్యాయులే ముందు వరుసలో ఉంటారన్నారు. తన తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం వల్ల తమ గృహంలో ఎలాంటి పెళ్లిళ్ల కార్యక్రమం జరిగినా ఆహ్వాన పత్రికలు ముందు ఉపాధ్యాయులకే అందిస్తామని, దీని వల్ల చిన్ననాటి నుంచి ఉపాధ్యాయుల సాధక బాధలు తనకు పూర్తిగా తెలుసునన్నారు. నోబెల్ పొజిషన్‌లో ఉన్న ఉపాధ్యాయులంతా ప్రతి రోజు ఒక మంచి సానుకూల దృక్పథంతో ముందడుగు వేయడం ద్వారా మరింత మందిని ప్రభావితం చేయగలరన్నారు.సభకు వచ్చిన ఉపాధ్యాయులు, మేధావులకు శుభకాంక్షలు తెలిపారు.

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నాశనం

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యాభైఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యం అయ్యానని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని... 3,4,5 తరగతులను హైస్కూల్‌లో కలిపి చాలా తప్పిదం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ మైనా విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో సంఘంలో ఐక్యత తీసుకురావడానికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలుపించుకోవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అందరూ కలిసి రక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీలను నింపాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలన్నారు. 2007నుంచి ఇప్పటివరకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ మద్దతు లభించిన పట్టభద్రులు, ఎమ్మెల్సీలు 14సార్లు గెలుపొందారన్నారు. మార్చిలో జరిగే శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడుతున్న విజయగౌరీని.. కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి పట్ట భద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న తనని గెలిపించాలని కోరారు. తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని 2రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ప్రపంచబ్యాంకు కను సన్నల్లో నడుస్తుందన్నారు. పేద వర్గాలు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్ర మాదకర పరిస్థితిలో ఉన్న విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. రానున్న రోజుల్లో 24వేల ప్రభుత్వ పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయన్నారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా చట్టం 2020 విద్యా వ్యాపారానికి అనుకూలం గా ఉందన్నారు. గత విద్యా మహాసభలో యూటీ ఎఫ్ సభ్యత్వం 80వేలు ఉండగా ఈ 17వ విద్యాసభకు అది కాస్తా లక్ష దాటిందన్నారు. ఉపాధ్యా యులకు ఉండే నిబద్ధతకు ఇదే ప్రతీక అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల, మత, ప్రాంత వర్గాలకు అతీతంగా యూటీఎఫ్ ఉపాధ్యాయులు సమాఖ్యంగా పోరాటం చేయాలన్నారు. మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేది కను హనుమంతురావు, మహిళా కమిటీ నివేదికను కుసు మకుమారి, రాష్ట్ర యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను మనోహర్ కుమార్‌లు ప్రవేశపెట్టగా కమిటీ ఏకా గ్రీవంగా తీర్మానించింది. అనంతరం యూటీఎఫ్ అకాడమిక్ అంశాల్లో ప్రతిభ చూపినవారికి జ్ఞాపికలను అందించారు. అనంతరం విప్లవగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కుసుమ కుమారి, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు కే.నగేష్, పి.చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శులు అరుణ కుమారి, సుభాషిని, కిషోర్‌కుమార్, మోహన్ రావు, శ్రీలక్ష్మీ, సుభాషిని, అన్నారాం, జ్యోతిబసు, యూటీఎఫ్ కృషిరాష్ట్ర పత్రికాబాద్యులు ఐ.ప్రసాద్‌రావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటితో స్వర్ణోత్సవాల ముగింపు

గత 3రోజులుగా పీఆర్ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారంతో ముగుస్తాయి. బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకుని ప్రకటిస్తారు



యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

అక్కా అని పిలుస్తూ.. వివాహేతర సంబంధం!



కూళ్లలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

కూళ్లలో జరిగిన హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కె.గంగవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మిత్రుల మధ్య గొడవకు అనంతరం హత్యకు వివాహేతర సంబంధమే కారణంగా భావిస్తున్నామని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ టీఆర్‌కెసి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన హత్య ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతిచెందిన శివ సురేష్ ఇంటికి రోజూ పాలు పోయడానికి వెళ్లేవాడు. సురేష్ భార్యను శివ అక్కా అని పిలిచేవాడు. వారం రోజుల క్రితం శివ పని నుంచి కొంతసమయం ముందే ఇంటికి వచ్చేశాడు. సురేష్ ఇంటి వెనకాల సురేష్ భార్యతో మాట్లాడుకుంటూ ఉండగా ఇది సురేష్‌కు అనుమానం కలిగించింది. దీంతో సురేష్ తన భార్యని పుట్టింటికి పంపించేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న సురేష్ శివను మద్యం తాగడానికి రమ్మని పిలిచాడు. అక్కడ వివాహేతర సంబంధం విషయంపై గొడవ పెట్టుకున్నాడు. అక్కడ శివను సురేష్ బ్లేడ్‌తో మెడపై కోసేశాడు. తరువాత దమ్ము చేసిన పొలంలో బోర్లా పడేసి ఊపిరిఆడకుండా మట్టిలో కూరేసి హత్య చేశాడు. గ్రామంలోని వెళ్లి శివను తాను చంపివేశానని కొంతమందికి చెప్పాడు. అనంతరం పరారయ్యాడు. దీనిపై ఇప్పటికే పామర్రు పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారిగా మండపేట రూరల్ సీఐ పి.దొర రాజును, సహాయకునిగా పామర్రు ఎస్ఐ ఎస్‌కె.జానీబాషాను నియమించారు. వారి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. శివ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని డీఎస్పీ తెలిపారు.

పొగాకు బ్యారన్‌లో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతవుతున్న పొగాకు బ్యారన్

రూ.6 లక్షలు ఆస్తినష్టం

గండేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో గొల్లవిల్లి బాబూరావు పొగాకు బాయిలింగ్ చేయడానికి లైసెన్స్ కలిగిన బ్యారన్‌లో మంగళవారం తెల్లవారుజామున సుమారు 5.30గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో బ్యారన్ పొగాకు పంట ఉంది. సుమారు పొగాకు విలువ రూ.1.50లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. బాయిలింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన బ్యారన్ కూడా పూర్తిగా అగ్నికి దగ్ధమైందని, బ్యారన్ విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని రైతు చెప్పాడు. అగ్ని ప్రమాదం జరగ్గానే రైతులు మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే బ్యారన్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

10న డిప్యూటీ సీఎం పవన్ రాక

- పిఠాపురం, గొల్లప్రోలులో పర్యటన
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఈ నెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. పిఠాపురం లేదా గొల్లప్రోలులో జరిగే సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలం మల్లాంలోని గోకులం, విరవాడ, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలను, పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని కలెక్టరు పరిశీలించారు. ప్రారంభోత్సవాల అనంతరం పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని సందర్శించే అవకాశం ఉంది. సభ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు ఉన్నారు.

ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఈనెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పిఠాపురం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే సభా కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

ప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు

అన్నవరం దేవస్థానం ఈవో

అన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ప్రీతికరం, అమృతతుల్యమైన గోధుమరవ్వ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సూచించారు. మంగళవారం ఆయన ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించి ప్రసాదాన్ని రుచి చూశారు. ఏ విధంగా తయారు చేస్తారు, దిట్టం తదితర అంశాలను ప్రసాదం విభాగ ఇన్‌చార్జి పోల్నాటి లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం చాలా రుచిగా ఉందని, మరింత రుచి పెంచేందుకు అవకాశం ఉంటే ప్రయత్నించాలని వంటస్వాములను ఆదేశించారు. ప్యాకింగ్ తయారీ విధానాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరును ప్రశంసించారు. పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.



ప్రసాదం రుచి చూస్తున్న ఈవో సుబ్బారావు

కానిస్టేబుల్ అభ్యర్థులకు కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపికలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 7వ రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. పరీక్షలకు మొత్తం 285మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 233మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షిస్తున్నారు.

ఏడిదలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పాల్గొన్న ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు వాయిద్య కళాకారులు

మండపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలోని శ్రీఅభయ అంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిదుర్గ నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వెంటూరి సూర్యనారాయణ సారథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు నుంచి వచ్చిన నిష్ణాతులైన వాయిద్య కళాకారుల కచేరీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. 500 మంది కళాకారుల సంగీత స్వర మాధురితో ఏడిద మార్మోగింది. శాస్త్రీయ సంగీతాన్ని కాపాడుతున్న ఏడిదకు చెందిన వెంటూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు కళాకారులను టీడీపీ యువ నేత వల్లూరి సాయికుమార్ బాబు సత్కరించారు. కంచికామకోటి ఆస్థాన విద్వాన్ 'సంగీత సామ్రాట్ కె.దుర్గాప్రసాద్, శ్రీలంకకు చెందిన డోలు విద్వాంసుడు ఆర్వీఎస్ శ్రీకాంత్, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి ఆస్థాన విద్వాంసుడు రామవరపు చక్రధరరావు కచేరీ అలరించింది. టీడీపీ నాయకుడు పర్వతిన వీర్రాజు, కళాకారులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న నాదస్వర కచేరి, త్యాగరాజస్వామికి ప్రత్యేక అలంకరణ

లారీని ఢీకొన్న మినీ వ్యాన్

సామర్లకోట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో ఏడీబీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ఎదురుగా మరొక వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి ఎదురుగా విశాఖ నుంచి సామర్లకోట రాక్ సిరామిక్‌కు వస్తున్న తమిళనాడుకు చెందిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన 2 వాహనాలను సామర్లకోట పోలీ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

క్రికెట్ కిట్ల అందజేత

కరప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరప జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో పలు జట్లకు క్రికెట్ కిట్లను అందజేసినట్టు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. పాఠశాల పూర్వవిద్యార్థులు, మిత్రుల సహకారంతో మెరకవీధి, పేపకాయలపాలెం, కరప ఫ్రెండ్స్ క్రికెట్ టీమ్‌లకు రూ.37వేలు విలువ చేసే కిట్లను పంపిణీ చేశామని ఆయన చెప్పారు.

సర్వే రికార్డుల కోసం కోల్డ్ వార్!

- పెద్దాపురంలో తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల మధ్య సర్వే రికార్డు గోల
- మున్సిపల్ సర్వే రికార్డులను అప్పగించని తహశీల్దార్ కార్యాలయం
- రికార్డుల కోసం సాగుతున్న ఉత్తర ప్రత్యురాలు
- మంగళగిరి సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయానికి చేరిన పంచాయితీ


మున్సిపల్ సర్వే కార్యాలయం విభాగం

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల మధ్య సర్వే రికార్డుల కోసం గత కొన్ని నెలలుగా కోల్డ్ వార్ జరుగుతోంది. సర్వే రికార్డులను తమకు అప్పగించాలని మున్సిపల్ సర్వే శాఖ అధికారులు తహశీల్దార్ కార్యాలయ అధికారులను కోరుతున్నా సరే సర్వే రికార్డులను అప్పగించకుండా కాలయాపన చేస్తూనే ఉన్నారు. దీంతో పట్టణ పరిధిలోని ఇళ్లు, పొలాలు సర్వే చేయాలంటే మున్సిపల్ సర్వే అధికారులకు తలనొప్పిగా మారింది. పట్టణంలో ఇళ్లు, స్థలాలు, పొలాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటే మున్సిపాలిటీకి సంబంధించిన సర్వే రికార్డు ఉండాలి. అది తహశీల్దార్ కార్యాలయంలో ఉండడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మున్సిపల్ సర్వే అధికారులు మళ్లీ తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో సమయానికి అక్కడ సర్వేయర్ అందుబాటులో ఉండకపోవడంతో పలుమార్లు తహశీల్దార్ కార్యా లయానికి ఇదే పనిమీద తిరగాల్సి వస్తోంది. దీంతో ప్రజలకు కాలయాపన జరగడంతో పాటు సమస్య పరిష్కారం కావడానికి చాలా నెలల సమయం పడు తోంది. రికార్డు మున్సిపల్ సర్వే విభాగంలో అందుబాటులో ఉంటే సమస్యలు పరిష్కారానికి అంతసమయం పట్టదు.

25 ఏళ్లుగా అక్కడే...

మున్సిపాలిటీకి సంబంధించిన సర్వే రికార్డులు అన్నీ గత 25 ఏళ్లుగా తహశీల్దార్ కార్యాలయంలోనే ఉండిపోయాయి. అలాగే మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సర్వేయర్ పోస్టు 25 ఏళ్లుగా ఖాళీగా ఉండడంతో పట్టణ, రూరల్ పరిధిలోని ఇళ్లు, పొలాలు, స్థలాల సర్వే సమస్య కేవలం ఒక మండల సర్వేయర్‌పైనే భారం పడేది. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ సర్వేయర్‌ను నియమించడంతో టౌన్ సర్వే రికార్డులను తహశీల్దార్ కార్యాలయం మున్సిపాలిటీకి అప్పగించాల్సి ఉంది. ఈ విషయంపై మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి, జిల్లా సర్వే అధికారికి, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ (మంగళగిరి) లేఖలు రాసినా కూడా తహశీల్దార్ కార్యాలయం నుంచి రికార్డులను మాత్రం అప్పగించడం లేదు. పైగా టౌన్ సర్వే రికార్డుల జిరాక్స్ కాపీలను తీసుకువెళ్లాలని తహశీల్దార్ కార్యాలయం నుంచి మున్సిపాలిటీకి లేఖను పంపించడంతో మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మున్సిపల్ టౌన్ రికార్డులకు సంబంధించి టౌన్ రిజిస్టర్, రెవెన్యూ వార్డ్ మ్యాప్స్, బ్లాక్ మ్యాప్స్, టౌన్ సర్వే రిజిస్టర్, తదితర రికార్డులు అన్నీ తహశీల్దార్ కార్యాలయంలో ఉండిపోవడంతో పట్టణ పరిధిలోని ఇళ్లు, స్థలాల సర్వే సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సర్వే అధికారులకు ఇబ్బంది

మున్సిపల్ సర్వే రికార్డులను అప్పగించడానికి తహశీల్దార్ కార్యాలయం ఎందుకు తాత్సారం చేస్తున్నట్టు అనే సందేహం కలుగుతోంది. ఇటీవల పట్టణ పరిధిలోని పలు అక్రమణలు జరిగినట్టు పలు ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ సర్వే అధికారులకు ఇబ్బంది కలుగుతోంది. మున్సిపాలిటీలో సర్వే రికార్డులు లేకపోవడంతో ప్రతీ చిన్న అవసరానికి తహశీల్దార్ కార్యాలయానికి పరుగెత్తాల్సి రావడంతో పట్టణ పరిధిలోని సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. కేవలం లేఖలతో కాలయాపన చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈవిషయంపై సర్వే సెటిల్‌మెంట్ భూమి రికార్డులను శాఖకు పంచాయతీ చేరింది. రికార్డులను మున్సిపాలిటీకి అప్పగించాలని ఆదేశించినా ఇప్పటికీ కూడా అప్పగించకపోవడంతో మున్సిపల్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించినట్లయ్యింది.

అప్పగించడానికి అభ్యంతరం లేదు

మున్సిపాలిటీకి సంబంధించిన సర్వే రికార్డులను అప్పగించడానికి అభ్యంతరం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

సీహెచ్ వెంకటలక్ష్మి, తహశీల్దార్, పెద్దాపురం

అవతవకలకు పాల్పడితే బాధ్యుల నుంచి రికవరీ

డ్వామా పీడీ వెంకటలక్ష్మి


ప్రజావేదికలో డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న దుర్గాడ గ్రామస్తులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో అవకతవకలకు పాల్పడితే బాధ్యుల నుంచి సదరు మొత్తాలను రికవరీ చేయడంతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని డ్వామా పీడీ ఏ.వెంకటలక్ష్మీ హెచ్చరించారు. ఉపాధి పథకం ద్వారా 2023-24 సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.9 కోట్లు విలువైన 677 ఉపాధి పనులు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరిగిన రూ.92.83లక్షలు విలువైన 26 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా జరిగిన రూ26.39లక్షలు విలువైన 7 పనులపై ఈ తనిఖీ జరిగింది. తనిఖీల్లో వెల్లడైన విషయాలను ప్రజావేదికలో తెలియజేశారు. తనిఖీల్లో గుర్తించి లోపాలు, అవకతవకలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు నుంచి, వారి ద్వారా రూ.45,799 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. అదేవిధంగా ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చెందుర్తిలో జరిగిన డ్రెయిన్ పనులకు సంబంధించిన రికార్డులు ఇవ్వకపోవడంతో రూ.99,736 జరిమానా విధించారు. పనులు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పీడీ తెలిపారు. ప్రజావేదికలో డ్వామా ఏపీడీ వసంతమాధవి, ఎంపీడీవో కర్రి స్వప్న, జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రవిశంకర్, హెచ్ఆర్ రాజేష్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ సింహాద్రి, ఏపీవో కొండలరావు, మండల ఇంజనీరింగ్ అధికారి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా దొంగ మస్తర్లతో నిధులు పక్కదారి పట్టించారని దురాడ గ్రామస్తులు డ్వామా పీడీకి ఫిర్యాదుచేశారు.

పిల్లలను కాపాడుకోవాలి : డీఎంహెచ్‌వో

కాకినాడ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రేపటి భవిష్యత్ కాలానికి పిల్లలే పౌరులు, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ డి.నరసింహ నాయక్ అన్నారు. రూరల్ మండలం తూరంగి పీహెచ్‌సీలో పడాల ఛారిటబుల్ ట్రస్ట్ సీఈవో పి.సూర్యప్రసాద్ బృందం ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంసీహెచ్‌పీలకు 100 శాతం పిల్లల జాగ్రత్త కోసం తీసుకోవాల్సినచర్యలపై స్కిట్లు, ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాల్గొని ఆరోగ్య శాఖ సిబ్బంది పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి ఆసుపత్రిలోని ప్రసవాలు, ఓపీ సేవలు, మందుల నిల్వలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. లేబర్ గది, ల్యాబ్ డ్రగ్ స్టోర్లను తనిఖీచేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వసుంధరా దేవి, డాక్టర్ మెహర్ ప్రత్యూష, డీఎస్‌వో గిరి గణేష్, ఎంపీహెచ్ఈవో పీవీప్రకాశరావు, మరియమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంపీహెచ్ఏలు పాల్గొన్నారు.

'ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు'

కాకినాడ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) కాకినాడ, సామర్లకొట, పెద్దాపురం ఏడీబీ రోడ్డు, కెనాల్ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడకు రాకపోకలు సాగించే వారి సంఖ్య భారీగా పెరగడంతో తరచూ రద్దీ నెలకొనడం.. మరోవైపు సామర్లకోట, కాకినాడ ఏడీబీ, కెనాల్ రోడ్డులో మరమ్మతుల దృష్ట్యా సామర్లకోట, అచ్చంపేట మధ్య ట్రాఫిక్ మరింత పెరిగిన నేపథ్యంలో పెద్దాపురం, సామర్లకొట, కాకినాడ రహదారులపై అతివేగంగా ప్రయాణించే వాహనాలను వేగనియంత్రణ చేసేందుకు ఇంటర్‌సెప్టర్ వాహనాన్ని ఏర్పాటు చేసి మార్గ మధ్యలో వేగనియంత్రణ బోర్డులు పెట్టారు. మద్యం తాగి లేదా హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారి పట్ల నిఘాను పటిష్టం చేశారు. సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ రూరల్ సీఐలు, సిబ్బంది రహదారి ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నట్టు ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు.

పులిమేరులో జువైనల్ జస్టిస్ బృందం పరిశీలన

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిమేరు గ్రామంలో ఉన్న శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను జువైనల్ జస్టిస్ బృందం మంగళవారం పరిశీలించింది. పాఠశాలలో చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. రికార్డులు, రిజిస్టర్లు, లైసెన్సులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో బృంద సభ్యులు చంద్రశేఖర్, వెంకట్రావు, ఉష, శ్రీనివాస్, సుధాకర్, పాఠశాల ఫౌండర్ రాయవరపు వీరబాబు, ఏవో వేణుగోపాల్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ శ్రీదేవి మృతి

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బచ్చు శ్రీదేవి (80) ఆకస్మికంగా మంగళవారం మృతి చెందారు. ఆమె 1995-2000లో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆమె కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల సమీక్షలో ఎమ్మెల్యే కొండబాబు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగే ప్రధాన మంత్రి మోదీ పర్యటన, రోడ్ షో, బహిరంగ సభ ఏర్పాట్లపై మంగళవారం ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వన మాడి కొండబాబు పాల్గొన్నారు. విశాఖపట్నంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కొండబాబు హాజరై పలు సూచనలు చేశారు.

జగనన్న కాలనీకి ప్రత్యామ్నాయ రహదారి

గొల్లప్రోలు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో రూ.4కోట్లు వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అధిక వర్షాలు కురిసినా, సుద్దగడ్డ కాలువకు వరదలు వచ్చినా జగనన్న కాలనీకి వెళ్లే మార్గాల్లో భారీగా నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఏడాదిలో ఏడుసార్లు సుద్దగడ్డ కాలువలకు వరదలు సంబంవించి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో రాకపోకలకు బోట్లు ఏర్పాటు చేశారు. వరదల సమయంలో కాలనీని సందర్శించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వారి ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పవన్ ఆదేశాలతో సీఎస్ఆర్ నిధులు నుంచి సుద్దగడ్డ కాలువ నీరు ప్రవహించే అండర్‌పాస్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.4కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు నవంబరులో పవన్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం సమయంలో జగనన్న కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ రహదారిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు చురుకుగా సాగుతున్నాయి. మరోవైపు సుద్దగడ్డ కాలువలో నీరు వెళ్లేందుకు వీలుగా తూరలు ఏర్పాటు చేశారు. బ్రిడ్జి నిర్మాణాన్ని 4 నెలల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు.


ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా పనిచేయాలి

- ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అనుపమ, చిత్రంలో ఎంపీపీ, జడ్పీటీసీ

కరప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేయాలని కోరారు. 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్‌ను అధికారులు సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి సభ్యుల సందేహాలను నివృత్తిచేశారు. బడ్జెట్ పత్రాల్లో దొర్లిన పలు తప్పులు, వైసీపీ ప్రభుత్వంలో అమలుచేసిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పేరిట హౌసింగ్ శాఖ సమర్పించిన నివేదికలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి సమావేశాన్ని ప్రారంభించారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఏవో బీఎల్ నరసింహం, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

కరప, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేరిన చికిత్స పొందుతూ మృతిచెందాడు. గొర్రిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి మణికంఠ(27) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత డిసెంబరు 31వ తేదీ రాత్రి కేక్ తీసుకురావడానికి గొర్రిపూడి సెంటర్‌కు వెళ్లాడు. తిరిగివస్తుండగా పీటీపుంత వద్ద బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కరెంట్ పోల్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మణికంఠను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. అతడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్ఐ తోట సునీత కేసు దర్యాప్తు చేపట్టారు.

స్కూటీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కొత్తపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో వేగంగా వస్తున్న స్కూటీ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపల్లికి చెందిన తాపీ మేస్త్రీ అడపా సూరిబాబు మంగళవారం భోజనానికి ఇంటి వచ్చి బైక్‌ను ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయడానికి వెళుతున్నాడు. ఆ సమయంలో ఉప్పాడ నుంచి కొత్తపల్లి వైపు వేగంగా వస్తున్న స్కూటీ అతడ్ని ఢీకొట్టింది. సూరిబాబు తలకు తీవ్ర గాయమైంది. దీంతో అతడు అపస్మారక స్థితికి చేరాడు. అతడ్ని కాకినాడలో ప్రైవేటుఆసుపత్రికి తరలించారు.

కట్టమూరులో రీసర్వే గ్రామసభ

పెద్దాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కట్టమూరు గ్రామంలో భూరీసర్వే గ్రామసభ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ హాజరై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మండల సర్వేయర్ సామోర్, వీఆర్వోలు నండూరి ప్రసాదరావు, ఏవీవీ లక్ష్మీ, కూటమి నేతలు మేడిది శ్రీనివాస్, మాదిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

భవిష్యత్ నైపుణ్యాల అభివృద్ధిపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న సాంకేతిక నిపుణులు, డైరెక్టర్, ప్రిన్సిపాల్

కాకినాడ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో భవిష్యత్ నైపుణ్యాల అభివృద్ధి, కృత్రిమ మేదస్సు, మెషీన్‌లెర్నింగ్, డేటా సైన్స్, ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించి శిక్షణ ఇచ్చారు. కళాశాల, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఎడ్యునెట్ సంయుక్తంగా ఐబీఎం స్కిల్ బిల్డ్ ఆధ్వర్యంలో సీఎస్ఈ, ఈసీఈ ఇంజనీరింగ్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఆధునిక సాంకేతికతను పరిచయంచేసే వర్క్‌షాప్‌ను వారం రోజులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. వర్క్‌షాప్‌లో 450మంది విద్యార్థులకు, అధ్యాపకులకు సాంకేతిక నిపుణులు అశ్విన్‌కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొని ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, సీఎస్ఈ విభాగాధిపతి ఎంఎస్ఆర్ఎస్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి ఎన్.రాజేష్ బాబు, ట్రైనింగ్,ప్లేస్‌మెంట్ అధికార్లు రమేష్,శ్రీనివాస్ పీఆర్వో సాయిబాబు పాల్గొన్నారు.

కళాశాల వద్ద జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన


ధర్నా నిర్వహిస్తున్న జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన వారిని ఆదుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ చేబ్రోలు శివారులో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కూలీలు ఇంటికి ఆటోలో వెళ్తున్న సమయంలో రెండు నెలల క్రితం ఆదర్శ్ కళాశాల బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పిల్లా దేవి, వెంకటలక్ష్మి, అంజూరి గంగాభవానీలకు గాయాలు కాగా చికిత్స చేయించారు. అనంతరం కళాశాల ప్రతినిధులు తమను పట్టించుకోలేదంటూ వారు సహచర కూలీలతో కలిసి కళాశాల గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. వీరితో కళాశాల ప్రతినిధులు చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు.

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో వన్నెపూడి విద్యార్థుల ప్రతిభ

గొల్లప్రోలు రూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్ టెన్నిస్‌జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి పురస్కారాలు అందుకున్నారు. చండీఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాల పదో తరగతి విద్యార్థిని సత్య దివ్యసాయిశ్రీ ప్రతిభ కనబర్చి అందరి ప్రశంసలు అం దుకుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో శేషమణికంఠ, దత్తరాజేష్, సిద్ధు, దుర్గదత్త, కీర్తి, అఖిల్, శివ మణికంఠలు ప్రతిభకనబరచి పతకాలు సాధించారు. వీరిని మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీఎల్ రాజేంద్రప్రసాద్, పీడీ వీఎస్ రత్నకుమారి అభినందించారు.

'ఇంటికి తాళం బయటకు కనిపించేలా వేయవద్దు'

సర్పవరం జంక్షన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో ఇంటికి తాళం బయటకు కనిపించేలా తాళం వేయరాదని, తాళం వేసినట్లు బయటకు కనిపిస్తే ఇల్లు చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ కోరారు. చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదని, బంగారు ఆభరణాలు, నగదును వెంట తీసుకెళ్లాలన్నారు. ఇంటికి తాళం కప్ప బయటకు కనిపించకుండా చేయడం ద్వారా చోరీలను నివారించవచ్చన్నారు. అలాగే ఇంటి భద్రత, చోరీల నియంత్రణ కోసం లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటికి తాళాలు వేసుకుని బయట ఊళ్లకు వెళ్లే వారు ముందుగా ఈ పరికరం కోసం సమీపంలో గల పోలీసులను సంప్రదిస్తే ఇంటికి వచ్చి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చోరీల నియంత్రణ కోసం పోలీసులు చేసిన సూచనలు పాటించాలని కోరారు.

ఉద్యోగాలకు 141మంది 'ఆదిత్య' విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన సీఎంఎం లెవల్-5 సాఫ్ట్‌వేర్ కంపెనీ యాక్సెంచర్ సంస్థ యాజమాన్యం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 141మంది ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీయీవీఎల్ నాయుడు తెలిపారు. వారికి రూ.3.5లక్షల వార్షిక వేతనం లభిస్తుందన్నారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్ కరుణ, బ్యూలా, షాహిద్దీన్, ఫణికుమార్, రెహ్మాన్, రామకృష్ణ, ప్లేస్‌మెంట్ సమన్వయకర్తలు కుమార్, కిషోర్ అభినందించారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సుదర్శనం

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుగా వాలుతిమ్మాపురం గ్రామానికి చెందిన చిలకపాటి సుదర్శనం నియమితులయ్యారు. ఈమేరకు ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మాజీ ఎంపీ పళ్లంరాజు చేతులమీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయనను కాంగ్రెస్ నేతలు మాదేపల్లి సత్యనారాయణ, తుమ్మల దొరబాబు, తోట కరుణాకర్ (సోనీ) అభినందించారు.

గోదావరి జలాల పంపింగ్‌కు సన్నాహాలు పూర్తి

సామర్లకోట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలకసంస్థ ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరందించే కాకినాడ శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు సామర్లకోట లాకుల నుంచి గోదావరి జలాలను పంపింగ్ చేసే ప్రక్రియకు సామర్లకోట లాకుల వద్ద మంగళవారం సాయంత్రం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతీ ఏటా వేసవిలో త్రాగునీటి ఎద్దడి కాకినాడ పట్టణ ప్రజలకు ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ నగరపాలకసంస్థ సామర్లకోట లాకుల నుంచి కాకినాడ శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు మాత్రమే కాకుండా సామర్లకోట శివారు ఉన్న మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్‌నకు సైతం గోదావరి జలాలను పంపింగ్ చేసేందుకు రెండు భారీ మోటార్లను ఏర్పాటుచేసి పంపింగ్ చేస్తారు. అదేరీతిలో ఈఏడాది వేసవి కాలం రాకుండానే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాకినాడ నగరపాక సంస్థ గోదావరి జలాల పంపింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈమోటార్లతో గోదావరి జలాల పంపింగ్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి ద్వారా నిలదొక్కుకునేలా బీసీలకు సబ్సిడీ రుణాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం రూపకల్పన చేయడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నగరంలోని సెలూన్ షాపులను కాకినాడ జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ సందర్శించి ప్రస్తుత మారుతున్న కాలానికి అనుగుణంగా డీ-టు సెలూన్ షాపులుగా తయారు చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను నాయీబ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులకు రాజకీయపరంగా అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీస్ డిపార్ట్‌మెంట్లలో నాయీ బ్రాహ్మణులకు కోటా పెంచి భర్తీ చేయాలన్నారు. జిల్లా, నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

51మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

జేఎన్టీయూకే, జనవరి 7(ఆంధ్రజ్యోతి): యూసీఈకేలోని సివిల్ సెమినార్‌హాల్లో బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యనభ్యసిస్తున్న 51మంది విద్యార్థులకు కాకినాడ ఇంజనీరింగ్ అలూమ్నీ ట్రస్ట్ ఫర్ సర్వీస్ (కీట్స్), లక్ష్మీ ఫౌండేషన్‌లు సంయుక్తంగా స్కాలర్‌షిప్‌లను మంగళవారం అందజేసాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ మురళీ కృష్ణ మాట్లాడుతూ యూసీఈకేలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థులు 30మందికి కీట్స్ సంస్థ, బాలికలకు లక్ష్మీ ఫౌండేషన్ ద్వారా 21మందికి ఒక్కొక్కరికీ రూ.20,000చొప్పున మొత్తం 51మందికి స్కాలర్‌షిప్‌లను పంపణీ చేసామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ స్వరూపారాణి, దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో ఆకుకూరల సాగు పరిశీలన

పిఠాపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పి.దొంతమూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎన్‌పీఎం షాపుల నిర్వాహకులు, ప్రకృతి రైతులు మంగళవారం సందర్శించారు. శిక్షణా తరగతుల్లో భాగంగా వారు క్షేత్రంలో 20సెంట్లు భూమిలో ఏటీఎం మోడల్‌లో పండించిన 22రకాల తీగజాతి కాయగూరలు, ఆకుకూరలు సాగు చేసిన తీరును పరిశీలించారు. జీవామృతం, జీవచారు తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ లీడ్ జానకి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ గణేష్, రిసోర్స్ పెర్సన్ శివచక్రం, ఎన్ఎఫ్ఏలు అప్పలనాయుడు, రాజారమణి, సంధ్య, ఎంటీ రామలక్ష్మీ, భాను పాల్గొన్నారు.

మురుగు కాల్వలకు మరమ్మతులు చేయాలి

తాళ్లరేవు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటలు సక్రమంగా సాగేందుకు మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరింగ, నీలపల్లి నీటిసంఘాల అధ్యక్షులు అల్లూరి సాయిరాజు, ధూళిపూడి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో డ్రైనేజీ ఏఈ పాలెపు వీరబాబుతో మురుగుకాలువల సమస్యలపై చర్చించారు. డ్రైనేజీ వర్కులు ప్రతిపాదనలు తయారుచేసి ఇవ్వాలని ఏఈ వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంగేటి సూరిబాబు, నీటిసంఘాల ప్రతినిధులు కాళా సత్తిబాబు, పోసింశెట్టి లోవరాజు, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాటి సాంబశివరావు వర్ధంతి

ఎటపాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాట యోధుడు తాటి సాంబశివరావు 14వ వర్ధంతిని మంగళవారం మేడివాయి కొమరం భీం నగర్‌లో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాంబశివరావు చిత్రపటానికి ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు పుష్పమాల వేసి నివాళి అర్పించారు. సున్నం నర్సింహారావు, కుంజా వినోద్, కొమరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలీసుల విస్తృత తనిఖీలు

మోతుగూడెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం నేపథ్యంలో మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద భద్రతను మరింత పెంచారు. గంజాయి రవాణా అవుతోందన్న నిఘా వర్గాల హెచ్చరిక, పర్యాటక ముసుగులో స్మగ్లర్లు రవాణా చేస్తున్నారనే సమాచారంతో తెలంగాణ వైపు వెళ్లే వాహనాలను మోతుగూడెం రాములవారి గుడి వద్ద ఆపి తనిఖీ చేశారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే వాహనాలను మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల్లో వస్తున్న వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, సివిల్‌పోలీసులు, సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.


మోతుగూడెంలో కారును తనిఖీ చేస్తున్న సివిల్, సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ పోలీసులు

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): మంగళవారం వారపు సంత నేపథ్యంలో అడ్డతీగల ప్రధాన కూడలి వద్ద రవాణా శాఖ రంపచోడవరం అధికారి ఆర్.రాజేష్‌కుమార్ సుమారు 100 వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని పది ప్రైవేటు వాహనాల నుంచి రూ.70వేలు అపరాధ రుసుము వసులు చేశారు.

ఇంటి నిర్మాణానికి సాయం

ఎటపాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం పంచాయతీ (శ్రీరామ్‌నగర్ కాలనీ) దమ్మక్కగూడేనికి చెందిన సూట్రు వెంకటరామరావు ఇల్లు ఇటీవల దగ్ధమైంది. ఇంటి పునర్నిర్మాణానికి బాధిత కుటుంబానికి టీడీపీ రాష్ట్ర నాయకుడు, జేకే చారిట బుల్ ట్రస్టు చైర్మన్ జామాల్‌ఖాన్ రూ.20 విలువ చేసే సిమెంట్ రేకులు, ఇనుప పైపులను అందజేశారు. ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన కృష్ణవరం గ్రామంలోని చిచ్చడి రామారావు, పర్శిక రాజులు కుటుంబాలకు ఒకొక్కరికి రూ 5 వేలు చొప్పున సాయంను అంధజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ నాయకులు కణితి మధు, బొల్లా పుల్లయ్య, దానే రాజు పాల్గొన్నారు.


సిమెంటు రేకులు, పైపులు అందిస్తున్న జమాల్‌ఖాన్


సర్టిఫికెట్ అందుకుంటున్న నాగిరెడ్డి

నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నాగిరెడ్డి సత్తా

ఎటపాక, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మండలంలోని నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.నాగిరెడ్డి సత్తా చాటాడు. 45 వయసు గ్రూప్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, జావలిన్ త్రోలో రెండో స్థానం, షాట్‌పుట్‌లో మూడవ స్థానం కైవసం చేసుకున్నాడు. 400/100 మీటర్ల రిలేలో రెండో స్థానం సాధించాడు. జాతీయ స్థాయిలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే 6వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు నాగిరెడ్డి ఎంపికయ్యారు.


ప్రతిభ చాటిన కూనవరం మండల ఉపాధ్యాయులు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో కూనవరం ఉపాధ్యాయుల ప్రతిభ

కూనవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో కూనవరం ఉపాధ్యాయులు సంప్రదాయ గిరిజన ఆటపాటలతో అలరించారు. ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. యూటీఎఫ్ సాంస్కృతిక కళా మండలి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎస్ నాయుడు నుంచి జ్ఞాపిక అందుకున్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

రంపచోడవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని, నూతన స్మార్ట్ మీటర్ బిగింపు ప్రక్రియ నిలిపివేయాలని, 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే ఆదివాసీలు, దళితులకు రాయితీ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు సమీపంలోని విద్యుత్ కార్యాలయాలకు వినియోగదారులు, ఆదివాసీ సంఘాలు, రాజకీయపక్షాలు, ప్రజలు వెళ్లి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చన్నారు.

కోరం లేక పీసా గ్రామసభ వాయిదా

దేవీపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు సచివాలయంలో సర్పంచ్ కోసు లక్ష్మణ్ అధ్యక్షతన సెక్రటరీ సత్యనారాయణ సమక్షంలో పీసా మూడవ గ్రామసభ ఎన్నికకు మంగళవారం ఏర్పాట్లు చేశారు. కోరం లేక వాయిదా వేసినట్టు దేవీపట్నం ఎన్నికల అధికారి వెంకటేష్ తెలిపారు. దీనిపై ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ పీసా గ్రామసభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకుల జోక్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

వై.రామవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు మంగళవారం వ్యవసాయాధికారులు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో 50 మంది రైతుల దగ్గర మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జ్యోతిర్మయి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి, సామర్లకోట ఏవో, ఏడీఏ సావిత్రి, అడ్డతీగల ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ముగిసిన సంప్రదాయ క్రీడా పోటీలు

జగ్గంపేట రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు నిర్వహించిన సంప్రదాయ క్రీడా పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి క్యాంప్ ఫైర్‌ను వెలిగించారు. విజేతలకు ఆమెతో పాటు జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జూదాల వైపు ఆకర్షితులు అవకుండా పోలీసులు ఇటువంటి సంప్రదాయ క్రీడలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా తమ వంతు కృషి చేస్తున్నా మన్నారు. పురుషుల విభాగంలో.... వాలీబాల్ విజేత గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ జగ్గంపేట, కబడ్డీ విజేత జిల్లా పరిషత్ హైస్కూల్, జగ్గంపేట, మహిళల విభాగంలో వాలీబాల్ విజేత జిల్లా పరిషత్ హైస్కూల్ మల్లిశాల, త్రోబాల్ విజేత భాష్యం స్కూల్, జగ్గంపేట, కబడ్డీ విజేత జగ్గంపేట హైస్కూల్. సీనియర్స్ పురుషుల విభాగంలో వాలీబాల్‌లో ఇర్రిపాక, కబడ్డీలో మల్లిశాల విజయం సాధించాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.1.20 లక్షలు విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్‌ఐ రఘునందనరావు, టీడీపీ నేతలు మారిశెట్టి భద్రం, ఎస్వీఎస్ అప్పలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జ్యోతుల మణి, తుమ్మలపల్లి రమేష్

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదాయ క్రీడలు ముగిశాయని గండేపల్లి ఎస్‌ఐ యూవీ శివనాగబాబు అన్నారు. గండేపల్లి నుంచి 33 టీమ్‌లు తలపడగా వాలీబాల్ సీనియర్స్ విభాగంలో మురారి రెండవ స్థానం, జూనియర్స్ విభాగంలో గండేపల్లి మూడవ స్థానం సాధించాయి. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహనరావు, నేతలు కందుల చిట్టిబాబు, పరిమి బాబు, అడబాల భాస్కరరావు, తెలగరెడ్డి భద్రరావు పాల్గొన్నారు.



సంక్రాంతి ముందస్తు సంబరాలు

రౌతులపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపట్నం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుమ్మడి గంగరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలను చుట్టూ ఉంచి పసుపు కుంకమలతో సుందరంగా అలంకించారు. గొబ్బిళ్ల ఆడారు. భోగి మంటలు ఏర్పాటు చేశారు. హరిదాసు వేషధారణలతో కీర్తనలు అలరించారు. ఉపాధ్యాయులు పోతురాజు, కాపు మధులత, శ్రీఫణి, సురేష్ పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి

తొండంగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను విద్యావంతులు చేసేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేశ్వరరావు కోరారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో వలంటీర్లకు స్టడీ మెటీరియల్ అందించారు. జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఏపీఎం సత్తిబాబు, విజయలక్ష్మి, బేబి,సత్యనారాయణ, అన్నపూర్ణ, చంటమ్మ, బాబి పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

తుని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం కొత్తపాకలులో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల బెల్లపు ఊట గుర్తించారు. దానిని ధ్వంసం చేసినట్టు తుని ఎస్‌హెచ్‌వో వై.పట్టాభి చౌదరి తెలిపారు.

రేపటి నుంచి 'ఆదిత్య' యూత్ ఫెస్ట్

గండేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ విద్యార్థులకు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఆదిత్య కలర్స్-2025కు ప్రాంగణం ముస్తాబైంది. ఈ నెల 9,10,11 తేదీల్లో ఆదిత్య యూత్ ఫెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు 60వేలకు పైగా విద్యార్థులు హాజరవుతారని అంచనా వేశామన్నారు. నిర్వహణకు పలు కమిటీలను నియమించినట్టు తెలిపారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాసరావు, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, డాక్టర్ విశాల్‌చవాన్, ఎస్‌టీవీఎస్ కుమార్, ఎ.విజయ భార్గవి, డీన్స్ పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలు ప్రాక్టీసు చేస్తున్న విద్యార్థులు

'సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం'

ఏలేశ్వరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ప్రత్తిపాడు సీఐ బి.సూరి అప్పారావు కోరారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ నేతృత్వంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంటును మంగళవారం ఆయన ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ సంక్రాంతికి గ్రామీణ సంప్రదాయ క్రీడలైన ఖోఖో, క్రికెట్, వాలీబాల్‌లను ప్రోత్సహిస్తామన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాట ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోళ్లకు కత్తులు కట్టే వారిని ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. ఎస్‌ఐ రామలింగేశ్వరరావు, టీడీపీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు, నూకతాటి ఈశ్వరుడు, కర్రోతు గాంధీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు

'చిన్నారులపై అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలి'

తొండంగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో చిన్నారులపై అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని ఎంఈవో షేక్ బాబ్జీ కోరారు. పోక్సో చట్టంపై మంగళవారం తొండంగి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నారులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. అవాంఛనీయ ఘటన జరిగితే ఏ విధంగా బయటపడాలన్న దానిపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో చట్టం చిన్నారులకు కలిగించే రక్షణ, వారికి ఇస్తున్న భరోసాపై చర్చించాలన్నారు. సంబంధిత కరపత్రాలు, గోడ పత్రికలను పాఠశాలల ఆవరణలో ప్రముఖంగా ప్రదర్శించాలన్నారు. శిక్షణ పొందిన ఆర్పీలు పలు అంశాలను వివరించారు. ఎంఈవో-2 అనిశెట్టి సుబ్బిరెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తొండంగి ఎంఈవో షేక్ బాబ్జీ

'విశ్వబ్రాహ్మణులకు పాలకవర్గాల్లో చోటుకల్పించాలి'

కిర్లంపూడి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా చోటు కల్పించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కిర్లంపూడి మండల శాఖ అధ్యక్షుడు గానుగుల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వాలు నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. ఆర్థికంగా ఆదుకోవాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత రుణాలు అందేలా చూడాలన్నారు. కార్యదర్శి కొత్తల వీరప్రసాద్, శలపాక శివప్రసాద్, లక్కోజు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు

రైతులు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విలువ ఆధారిత ఉత్పత్తులు సాధించడంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ కోరారు. మండలంలోని ఒమ్మంగిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది'లో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు వ్యవసాయంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తు లు తయారు చేసి వినియోగదారులకు నేరుగా చేరవేస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. వ్యవసాయ సిబ్బంది రాజా, చక్రం, రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాల్లో ఏవో సద్గురుమూర్తి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ హరి మాట్లాడుతూ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సూరంపాలెం సర్పంచ్ బాబూరావు, డీఆర్సీ ఏవో సంజీవ్, వీఆర్వో బాబా, ఏఈవో చంద్రమౌళి, వీహెచ్‌ఏ సాయికిరణ్, వీఏఏ సుమిత్ర, రైతులు పాల్గొన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయధికారి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఎస్అర్ పేట గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు రావడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తినవచ్చన్నారు. పోతల సూరిబాబు, ఎన్.సురేష్, ఎల్.శ్రీను, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ కొట్నాల మధుకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం రూ.5వేలు అందజేశారు. నానిపల్లి చంటి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, కుప్పెన శ్రీను, యాళ్ళ ఏసు, జువ్వల ముసలయ్య, గొనగా ఏసు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఈవో

సంక్రాంతి సంబరాలకు ఎంపీకి ఆహ్వానం

అన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో జరిగే సంక్రాంతి సంబరాలకు విచ్చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆహ్వానించారు. మంగళవారం ఆయన ఎంపీని కాకినాడలోని స్వగృహంలో కలిసి స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు.



డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించారు. 500 మందికి రమేష్ స్వయంగా భోజనాలు వడ్డించారు. రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, తుమ్మల ఫణీంద్ర, తుమ్మల మనోజ్, గంధం శ్రీనివాస్, మొగిలి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులపై శిక్షణ

గండేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జనవరి నుంచి జూన్ వరకు చేపట్టబోయే ప్రాధాన్యత పనులు, ఉపాధి హామీ చట్టం ప్రధాన అంశాలు, కూలీల హక్కులు, క్షేత్ర సహాయకుల విధులు, బాధ్యతలు, జాబ్‌కార్డులు, మేట్ సిస్టం, పనికి డిమాండ్, మస్తరు మేనేజ్‌మెంట్, మార్కు ఔట్ వర్క్స్, సుపరిపాలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో నాతి బుజ్జి, ఏపీవో ఆర్.గంగాభవానీ, ఈసీ పి.రమేష్, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సహాయం

తొండంగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోదాడలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకదారిపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పేకేటి దారకొండ రూ.20వేలు అందించారు. ఆయనకు యువ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

'అక్షరాస్యత పెంపునకు కృషి'

కోటనందూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో వెంకటనారాయణ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా వీవోఏలకు పుస్తకాల కిట్లు పంపిణీ చేశారు. ఏపీఎం సూర్యకుమారి, సీసీ నాగలక్ష్మి, దేవుడు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాల కిట్ అందజేస్తున్న దృశ్యం

ఆశాజనకంగా వరి దిగుబడులు

తుని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మెట్టలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. పంట తుది దశకు చేరుకోవడంతో తుని నియోజకవర్గంలో కోతలు ఊపందుకున్నాయి. తుని రూరల్ కుమ్మరిలోవ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి అశోక్ ఆధ్వర్యంలో జక్కాన వరకుమార్ అనే రైతు పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. ఎకరా విస్తీర్ణంలో ఎంటీయూ 1262 రకం అత్యధికంగా 50 బస్తాలు దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.


పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

కిరాణా షాపులో నగదు చోరీ

తొండంగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం గ్రామంలో పి.సత్యనారాయణకు చెందిన కిరాణా షాపులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. మంగళవారం ఉదయం చూడగా రూ.35వేలు నగదుతో పాటు కొన్ని వస్తువు లు చోరీకి గురైనట్టు గ్రహించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రైటర్ పాండురంగ తెలిపారు.

గవరపేటలో ఫ్లెక్సీ రగడ

తుని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తేటగుంట పంచాయతీ శివారు గవరపేటలో ఫ్లెక్సీ చించివేత వివాదానికి తెరతీసింది. కూటమి పార్టీల నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ, జనసేన కార్యకర్తలు శివాజీ, దొర, చంటిబాబు తెలిపారు.